# నేనున్నాను

మోహనుమంతరావు



డియర్ రాజా,

నువ్వీ జిల్లాకు పెద్దఆఫీసర్‌గా వస్తున్నావని తెలిసింది. నిన్ను చూడాలని వుంది. నువ్వెంత నాకు దూరమైనా నీకు దగ్గరగా రావాలనీ, నీ భుజాలపై చేతులేసి నీ కళ్లల్లోకి చూస్తూ మాట్లాడాలనీ, నా మనసులోని బాధను నీ ముందు ఉంచాలని వుంది. మళ్ళేదో నాదగ్గర దాస్తున్నావు. నా ఉత్తరాలకి జవాబు లివ్వడంలేదు. శ్యామల నన్ను విడిచి పెట్టిందా అని బాధ పడుతున్నావా? వొద్దు నేస్తం వొద్దు. నీకేమైనా బాధ కలిగితే నేను చూడలేను. నిన్ను చూడాలనివుంది. ఒకసారి నాదగ్గరకు వచ్చి "శ్యామల, నేనున్నాను. నీకోసం"—

రాజా ఉత్తరం చదవడం ఆపేసి దాన్ని నలిపి కాళ్ళ దగ్గరున్న చెత్తబుట్టలో పడేశాడు. అసలా ఉత్తరాన్ని చదవకూడదనుకున్నాడు. కాని అనాలోచితంగా చదివాడు. ఉదాసీనంగా బలంగా కణతలు రుద్దుకున్నాడు. కాని అతనికి శిరోవేదన తగ్గలేదు. శ్యామల రాసిన ఉత్తరాన్ని దూరం చేసుకున్నాడుగానీ ఆమె తాలుకు స్నేహస్మృతులకు దూరం కాలేక పోయాడు. గాఢంగానిట్టూర్చాడు. 'శ్యామల, శ్యామల.,. పరమ కిరాతకురాలు. మంచి మనసుగల మధుమూర్తి ఆత్మహత్యకి కారణమైన ఆ పాతకిని నేనెలా చూడగలను.. నేనున్నాను శ్యామలా..నీ బాధల్ని, కష్టాల్ని పంచుకోడానికి నేనున్నాను శ్యామలా..అంటూ దగ్గిరకు ఎలా తీసుకోగలను—అంటూ పరిపరి విధాల ఆలోచించాడు రాజా. అతని ఆలోచనలు భంగం చేస్తూ ఫోన్ మ్రోగింది. రసీవర్ అందుకున్నాడు.

"......"

"ఎవరూ.. నళినీదేవిగారా.. ఏమిటి విశేషాలు.."

"నిన్న అమలాపురం వెళ్ళాను. శ్యామల పరిస్థితి విషమించింది" మౌనంగా వింటున్నాడు రాజా.

"సదా మిమ్మల్నే కలవరిస్తున్నది. మీరొకసారి వెళ్ళిరండి."

"సారీ ప్లీజ్.. ఆమె ఎటువంటిపరిస్థితిలో వున్నా నేను చూడదలచుకోలేదు" అన్నాడు స్థిరస్వరంతో రాజా.

"ఆమె ఆఖరి క్షణాలలో వుంది. మిమ్మల్ని చూడాలనీ వేయి కళ్ళతో ఎదురు చూస్తుంది" ఆమె ఆర్ద్ర పూరిత స్వరంలోని ఆవేదన అతనిలో ఆలోచనలు లేపింది. అతనిమొహంపై రంగులు మారాయి. కాని నిరుత్తరుడిలా వుండిపోయాడు. అప్రయత్నంగా అతని నయనాలు సజలాలయినాయి. నళినీదేవి కంఠంలోని విషాదపు జీర అతని చెవులలో మారు మ్రోగుతోంది.

"వెళ్తాను. ఒకసారి చూసి వస్తాను అంతే" అంటూ రిసీవర్ హుక్‌కి తగిలించి గాఢంగానిట్టూర్చి, జేబురుమాలుతో మొహం తుడుచుకున్నాడు.

* * *

రైలు గమ్యం కోసం పరుగులు తీస్తున్నది. రాజా మస్తిష్కంలో చిన్ననాటి శ్యామల మెదిలింది. రాజుకి శ్యామలతో పరిచయం ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగింది. ఆరోజు పంతులమ్మ ఆరోఎక్కం వేయమంది. దగ్గిర బలపం లేక ఏం చేయాలో పాలుపోక మిగతా పిల్లల వంక చూస్తూ కూర్చున్నాడు రాజా.

"ఒరేయ్ రాజా.. నీకు ఆరో ఎక్కం వచ్చునా?" తనని పిలిచింది ఎవరా అని వెనక్కి తిరిగి చూశాడు. గది గుమ్మం దగ్గర కూర్చున్న శ్యామల తన ప్రశ్నని తిరిగి రెట్టించింది,

"వచ్చు..కాని బలపంలేదు.. దారిలో పారేసుకున్నాను."

"వూ!" అంటూ తలపంకించి తనపక్కనే కూచున్న మధు బలపం బలవంతంగా తీసుకొని మూడు ముక్కలు చేసి రాజుకో ముక్క యిచ్చింది. "మధు పంతులమ్మగారికి చెబుతాడేమో" అన్నాడు రాజా భయంగా.

"చెప్పలేడు" అంది తన పెద్ద పెద్ద కళ్ళను విచిత్రంగా త్రిప్పుతూ. రాజా ఎక్కం వేశాడు. కానీ కొట్టింది శ్యామల. అంతలో మధు "పంతులమ్మ గారు" అంటూ లేవబోయాడు. మధు చొక్కా పట్టుకొని లాగుతూ—"రేపు నీకు జీడీలు తేవద్దూ" అంది శ్యామల. అది అభ్యర్థనో లేక బెదిరింపో పాలుపోలేదు రాజుకి.

ఆ మొదటి పరిచయంలోనే యిద్దరు దగ్గరైనారు. శ్యామల రోజూ, రాజుని పిలుచుకొని పాఠశాలకి వెళ్లేది. ఇద్దరు కలిసి చదివేవారు. ఆటలాడేవారు. ఇద్దరూ మధ్యతరకం కుటుంబానికి చెందినవాళ్ళు కావడంవల్ల వాళ్ళ స్నేహం మరెంత పటిష్ఠమయింది. శ్యామల పరికిణీలు వేసుకుంటున్నది. రాజా పొడుగు

